

# ప్రథమ సోపానము

"మేమగునో – జీవిత మేమగునో – నా జీవితమేమగునో ఈ నా జీవిత – మేమగునో" అనే పాటని ఆరంభించాడు వరహాలరాజు.

రైలు 'టకటక'ల తాళం ఆపాటకి వాటంగా పడటంలేదు. రాజుకింకోపాట గుర్తుకు రావటంలేదు.

"ఆదిలోనే అదేదో పాదమా" అనుకున్నాడు. ఈ అపశకునానికి కొంత నొచ్చుకుని, గిట్టనివాళ్లు చాదస్తాలంటారుగాని, ఇలాటి శకునాలు గట్రా నిజమని సినిమాప్రపంచంలో అంతా నమ్ముతారని రాజు నమ్మకం. అతనికి ఇటువంటి విశ్వాసాలు చిన్నప్పటి నుంచీ ఉన్నాయి.

"ఉండకేం చేస్తాయి. ఏ హీరోగానో, డైరెక్టరుగానో, ప్రొడ్యూసర్

గానో కీర్తి ప్రతిష్ఠలు సంపాదించుకోవాలని దేముడు రాసిపడేశాడు కాబట్టే మనకీ నమ్మకాలమీద గురి ఉంది" అనేవాడు అతని నేస్తం ముత్యం.

"మరే పువ్వు పుట్టగానే పరిమళిస్తుంది గదా" అనేవాడు రాజు.

"గురో! బ్రిలియంట్ డైలాగ్ పడేశావు. దీన్నే ఏదో అర్థాంతర న్యాసం అనో ఏదో అంటారుట" అని ఎగిరి గంతేసేవాడు ముత్యం.

అంతా బాగానే ఉంది కాని, ఇప్పుడు పాడిన పాటకి రైలు నడక తాళం సరిపడకపోవడం, గింజుకున్నా ఇంకోపాట గుర్తుకు రాకపోవడం ఏమిటి చెప్మా అని మథనపడసాగాడు రాజు.

"చిటపట చినుకులు" అనే పాట సరిపోతుంది; అని సూచించి నట్టుగా, పక్కాయన దాన్ని లయబద్ధంగా పాడసాగాడు.

రాజు మొహం విప్పారింది.

"మందేవూరండి?" అన్నాడు ఆప్యాయంగా పలకరించి.

"మాది బొంబాయి. మీదేవూరో నాకు తెలీదు" అన్నాడాయన. రైలులోకి దూసుకువచ్చిన పైరుగాలికి చెదిరిపోతున్న మీసాలను కొనగోరుతో సరిచేసుకుంటూ.

"ఓ మాది మెడ్రాసులెండి." అన్నాడు రాజు గంభీరంగా చూస్తూ.

"ఏం చేస్తు ఉంటారు"

"హీరో ....మీరో?" అన్నాడు రాజు.

"ఎడిషనల్ డైలాగ్ .... అంటే అదనపు సంభాషణ అని అర్థం" అన్నాడు ఎదటాయన.

"మా ఫిలిం ఫీల్డుకి కొత్తే అనుకుంటాను."

''మీదేమిటి మాబొంబాయి ఫీల్డుకీకొ త్తే. హాలీవుడ్‌లోనే మా ఎడిషనల్ డైలాగు రైటర్లు ఉంటారు. ఇండియా బాగా వెనకబడ్డ దేశంగదా .... అంటే బాక్‌వర్డ్‌కంట్రీ అన్నమాట. బొంబాయిలో నేను చాల మందితో నన్ను పెట్టుకోమని చెప్పిచూశా. విన్నారు కాదు. అన్ని డైలాగులు రాసినవాడే కావలిస్తే అదనపు డైలాగులూ రాస్తాడులే అన్నారు. పైగా వాళ్ళకి హిందీ రాసిపెట్టాలిట. నేను ఇంగ్లీషుకి ఛస్తే ఒక్క మెట్టు దిగనన్నాను.''

''భలేవారండి....నేనూ అంతే. మామూలు వేషాలూ సైడుహీరో లాటివి బోల్డు దొరుకుతాయి మా ఫీల్డులో.ఛస్తే హీరో రోలుకి తక్కువదేం పుచ్చుకోనని శపథం నాకు''అన్నాడు రాజు గంభీరంగా.

''బెస్టు. మీరెందులో నటిస్తున్నారండి 'మిస్సమ్మ'లో ఉన్నారా?''

రాజు వినమ్రతను అభినయించి మందహాసం చేశాడు.

''లేనండి. ఎన్. టి. రామారావు, ఏ. నాగేశ్వరరావు, యస్. వి. రంగారావు, రేలంగి, సావిత్రి, జమున మొదలగువారు నటించిన ఈ చిత్రానికి శ్రీ ఎల్. వి. ప్రసాద్ దర్శకత్వం నిర్వహించారు. నెక్‌స్ట్‌ట్ పేరా. దీనికి రచయిత చక్రపాణి, సంగీత దర్శకత్వం ఎస్. రాజేశ్వరరావు ఛాయాగ్రహణం బార్టే. స్టుడియో వాహిని. ఇంకో నెక్స్ట్ పేరా. నిర్మాతలు: నాగిరెడ్డి అండ్ చక్రపాణి. అదండి. అందులో నేను లేను.''

''ఐ సీ. అదేపాయెగాని, పోనీ మీరెందులో ఉన్నారుట?''

''చెప్పాను గదండి. ఇంకా ఎవరితోనూ కాంట్రాక్టు సైన్ చెయ్యలేదు. బుక్ కాబడలేదు. ఫోటోలూ అవీ పంపించానండి. చాలమందికి ఉత్తరాలు రాశాను. ఇపుడు వెళ్ళి ఇక మాట్లాడాలి.''

''ఓ అదా. మీరు యింక వెళ్ళి ప్రయత్నిస్తారన్న మాట, చెప్పారుగాదూ. హీరోగారూ సిగరెట్టు పుచ్చుకోండి. మాట్టాడుదాం.''

"మీరో? అన్నట్టు మీపేరో? చెప్పారుకారు"

"నాపేరు నరసన్నలెండి. బొంబాయిలో ఉన్నప్పుడు ఇంకోపేరు ఉండేది కాని, ఇపుడు మెడ్రాసులో ఎందుకని వదిలేశాను. చూశారూ! మీరూ డైలాగులూ బాగారాస్తారూ." అన్నాడు నరసన్న నవ్వుతూ.

"మరేండి, ఏదో అలవాటైపోయింది. నేను ఎప్పుడు సంభాషణలు చేసినా రాసినా సంతృప్తికరంగానే ఉంటాయండి. సౌండు ఫర్వాలేదు."

"వెరిగుడ్ మెడ్రాసులో మీ బస ఎక్కడ? ఎవర్ని అడుగుతారు?"

"బసకేం తొందరొచ్చెసార్. సరాసరి, స్టారుస్టారింటికి కారుమీద వెళ్ళి ఫేసు చూపించేసి వేషం ఇప్పించి కొత్త వదనారవిందాలకు — అదే .... వేషం ఇమ్మంటాను .... ఆనక వాళ్ళే బసచూపిస్తారు."

"బస్, బస్, భలేవాడివయ్యా. అలావెళ్ళి అడిగేస్తే, ఇలా వెళ్ళిపో అనేస్తారు. నీకసలు టెక్నిక్ తెలీదన్నమాట. అన్‌ఫిట్, యూస్లెస్, హోప్‌లెస్, బిగ్‌మెస్. సినిమాలో చేరేవాడికి ఎన్నో అర్హతలు అవసరం. వాటిలో ఒకటో నెంబరు కూడా నీకు తెలిసినట్టు లేదు. ఒక చిన్న కథ చెబుతాను విను.

శ్రీకరంబును, తారల కాకరంబును, పేదలకు భీకరంబును నగు బొంబాయి నగరం బొండుగలదు...."

"మేష్టారూ చిన్నసంగతి .... మామూలుగా లైట్ టెలుగులో చెప్పలేరాండి." అన్నాడు రాజు ఇంకో సిగరెట్టు ముట్టించి.

"భేషుగ్గా చెప్తా. ఏంలేదు. అనగనగా బొంబాయి అనే ఊరు, ఊరేమిటి నా బొంద. మహానగరం. పెద్ద సిటీ.

నేను కొత్తగా ఆ ఊరు వెళ్ళినపుడు నాకెవరూ తెలీదు. చేత అచ్చే డబ్బులేదు. అయితేనేం, దారుణమైన తెలివితేటలున్నాయి. వెధవది

అదేమిటో చిన్నప్పట్నించీ అంతేలే. అయితేనే ఎవడో నీవంటి వాడే టోకరా యిచ్చేసి, పెట్టీ బేడా పట్టుకు చెక్కేశాడు. ఆనక నావంటివాడే నామీద జాలిపడి, ఆదుకుని పాపం నాదగ్గిరే టోకరా తిన్నాడు.

వాడి ధర్మమా అని బొంబాయిలోకూడా నేను చెలామణీ అవుతానన్న ధైర్యం కలిగింది.

వాడే కబుర్లు చెబుతూ, ఇక్కడలేని విద్య ఎక్కణ్ణించో మనం తెచ్చామని టముకు వేయిస్తే మనదే రాజ్యం అవుతుందన్నాడు. ఎప్పుడూ అంతేననుకో అబ్బాయి. నేను దిలీప్‌కుమార్‌లా నటించి పారేస్తానంటే, వాడున్నాడుగా మళ్ళీ నువ్వెందుకంటారు. అదే ఆర్సన్ వెల్స్ పేరుచెబితే, అమాంతం ఎగిరి గంతెయ్యకపోయినా ముందర తూలనాడరు.

నా జట్టు కట్టిన టోకరాసురుడు ఇలాంటి ప్లానే వేసి, ఆ గుట్టు నాకు చెప్పాడు.

తక్షణం నేను వాడిదగ్గరే నా పెన్ను తాకట్టుపెట్టి పదిరూపాయలు అప్పుచ్చుకున్నాను. అందులో రూపాయ బయానాయిచ్చి ఓ చోట గ్రీటింగు కార్డులు ప్రింటు కొట్టించి, శాంపులు కాపీలిమ్మని ముందస్తుగా నాలుగు పుచ్చుకు చక్కావచ్చాను. గ్రీటింగ్‌కార్డ్స్ అంటే తెలుసుగా. మన పేరు, డిగ్రీ గిగ్రీ ప్రింటు చేస్తారులే. ఏం? సుబ్బరమైన లాండ్రీవాడి దగ్గిరకెళ్ళి ఓ జతగుడ్డలు అద్దెకు తెచ్చుకుని, అవి జమాయించి, ఓ చిన్న పేపరాఫీసు కెళ్లాను.

అక్కడ నేనూ ఒకాయనా కలిసి కాఫీ తాగేశాక, నేను హాలీవుడ్ రిటర్న్ అనే అబద్ధాన్ని ఆరణాలకి అమ్మేశాను.

ఆయన దగ్గిర పలుకుబడి ఉందిట. దానికింద చాలామంది పడి ఉంటారట. ఆయన నన్నుచూసి నిజమే కామోసనుకొని, పేపరాయనకి నన్నుగురించి బాహా చెప్పేసి, రెండు ముక్కలు రాయించేశాడు.

మూడోనాటికి ఆపత్రిక వచ్చేసింది. నేను వెళ్ళదలచుకున్న డైరెక్టర్ ప్రొడ్యూసరింటికి స్వయంగా ఓ కాపీ పంపించాను.

ఆ సాయంత్రం కార్డు పంపించి, నేటి సినిమాఫీల్డులో అడిషనల్ డైలాగు రైటింగు (అనగా అదనపు సంభాషణా రచన) ఎంత అవసరమో దంచికొట్టి ఉపన్యసించేశాను.

నమ్మేరో లేదో తెలీదుగాని, వాళ్ళింటో ఓగది కాళీచేయించి, అక్కడ ఉండమన్నాడు. నేను హఠాత్తుగా కొన్ని చిక్కుల్లో పడ్డట్టు చెప్పాను. నా సామాను, నా పర్సు ఓడలో వస్తున్నాయనీ, నేను విమానంలో ముందస్తుగా వచ్చేశాననీని .... నమ్మక ఛస్తాడా అబద్ధం చెబుతే గోడకట్టినట్లు చెప్పమన్నారు. నేను లావుపాటి గోడకట్టినట్టు చెప్పేశానులే.

సరే అయన్తో ఆ స్టుడియోకీ ఈ కంపెనీకీ తిరగడంలో నలుగుర్నీ కలుసుకున్నాను.

చెప్పొద్దూ, నాకు చిన్నప్పట్నించీ ఎంత దారుణమైన తెలివితేటలున్నాయో అంత దారుణమైన చురుకుదనం, చొరవా కూడా ఉన్నాయి. అందుకని ఏ దిలీప్‌కుమారో ఎదురవగానే ''క్యా దిలీప్ భయ్యా తబీయత్ కైసే,'' అనేసే వాణ్ణి భుజం చరిచి. నేనెవడో తెలీక అతగాడు విస్తుపోయే సరికి, నా కూడా ఉన్నాయన పరిచయం చేసి ఎడిషనల్ డైలాగ్ రైటర్ అనేవాడు.

'ఫ్రమ్ హాలీవుడ్' అని ఠక్కున చెప్పేసేవాణ్ణి నేను. ఎందుకనో గాని ఆయన మటుకు ఎందరికి పరిచయం చేసినా హాలీవుడ్ సంగతి మర్చిపోయేవాడు.

మొత్తానికి ఇలా చాలామందితో నాకు పరిచయం కలిగింది. చూశావా నా నేర్పు, ఛాన్సు అడగడానికి ఇదో మంచిపద్ధతి అన్నమాట. నీకు ఇంత బుర్ర ఉందా?

(రాజు అడ్డంగా తల తాటించి లేదు అన్నాడు.) నరసన్న కథ సాగించాడు.

ఇంక మా యింటాయన కారుడ్రైవరు రుమాల్‌సింగ్, దర్వాన్ జమాల్, గుమాస్తా పెరుమాళ్, సెక్రటరీలు పరమానంద్, రామలాల్ లు మరీ ఫ్రెండ్లయి పోయారనుకో. నేనంటే ఎంతో గౌరవం. షీలాదేవి అని ఇంకో వంటావిడ వుండేది. ఆవిడ ఇంగ్లాండ్ రిటర్న్‌ట. ఇంగ్లీషు వంటలు స్పెషలైజ్ చేసింది.

వాళ్ళందరికీ కూడా దారుణమైన ప్రభుభక్తిలే. ఎంతో నే చెప్పలేను.

డ్రైవరు రుమాల్‌సింగ్ ఉన్నాడా. రాత్రి పదైనా సరే పధ్నాలుగైనా సరే. అలా వుండిపోయేవాడు యజమానికి కారు కావాల్సొంటుందని.

'వెళ్ళి ముద్దమింగి రావయ్యా' అని హిందీలో చెప్పేవాడనుకో.

అచ్చుకాని వేదాంతపుస్తకాలు బొచ్చెడన్ని రాసి కూర్చున్న తత్త్వ శాస్త్రజ్ఞుడులా దిగులుమొహం పెట్టి "నా జీవితలక్ష్యం మీకారు తోలుతూ దాని సేవచేయడమే. ఈ రుమాల్‌సింగ్ అంతకన్న కోరేదింకోటి లేదు" అనేవాడు హఠాత్తుగా – ఉంటే ఆకాశం, లేకపోతే ఇంటి వాసాలవంక చూస్తూ. అలాగే జమాల్, అట్లాగే పెరుమాళ్. అహోరాత్రాలు పనిచేసి కళ్ళెర్రగా చేసుకునేవారు. ఏమలా ఉన్నావంటే 'జీవితమే విచిత్రమైనది' అనేవారు గంభీరంగా.

ఆషానిరాషల మధ్య అల్లాడుతూ, అనంతంగా అవస్థలు పడుతూ (ఇవన్నీ హిందీలో అనేవారనుకో) అంటూ ఏదో సోదిలాటిది చాలా చెప్పేవారు.

ఒక్కోసారి మేమందరం 'లాన్'లో కూచుని కబుర్లు చెప్పుకుంటూ ఉంటామా.

దర్వాన్ భారంగా అడుగులువేస్తూ వచ్చి తలవంచుకుని నిలబడేవాడు.

ఏమిటి సంగతి అంటే ఓ కథ చెప్పేవాడు.

గేటు దగ్గరికి ఏడేళ్ళ పసివాడూ, పదిహేనేళ్ళ బాలకుమార్తె వచ్చి కన్నీళ్ళతో సినిమాఛాన్సు అడిగి, లేదనిపించుకుని ఎలా విచారంగా వెళ్ళిపోయేవారో, మా తాలూకు హృదయాలు కరిగిపోయేలా చెప్పి మళ్ళీ తలవంచుకుని భారంగా అడుగులు వేసుకుంటూ వెళ్ళిపోయేవాడు గేటులోకి.

తక్షణం సెక్రటరీ రామలాల్ "బ్యూటిఫుల్ సీక్వెన్సు కదూ" అని ముగ్ధుడైపోయి అలా శూన్యంలోకి చూసేవాడు.

"యస్.... వెరీ...."అంటూ సెక్రటరీ పరమానంద్‌కూడా డిటోపని చేసేవాడు.

అంతట్లోకి "జిందగీ యహీ హై" అన్న డైలాగు ఒక గద్గద కంఠంలోంచి ఇవతలికి వచ్చేది. అది ఇంగ్లాండ్ రిటరన్‌డ్ కుక్ షీలాదేవి తాలూకుదన్నమాట.

విశేషం ఏమిటంటే, ఈ పనివాళ్లు ఆరుగురూ ఎంతో అన్యోన్యంగా ఉండేవారు.

ఒక్కొక్కసారి వాళ్ళని చూస్తే "మసిపూసిన మాణిక్యాలు" అనే నవలపేరు జ్ఞాపకం వచ్చేది. కష్టాల్లో ఉన్న పంచపాండవులూ, ద్రౌపదీ గుర్తుకు వచ్చేవారు. తప్పే అనుకో. ఇంకోటి. మా ప్రొడ్యూసరు బావమరది ఎప్పుడూ వంటింట్లోనే తారట్లాడుతూ ఉండేవాడు. షీలాదేవి కిటికీలోంచి బయట చూస్తూ నిలబడి జిందగీ జిందగీ అంటూ ఉండేది.

ఆవిడ కీచకుడి గురించి ఎవరికీ ఫిర్యాదు చేసినట్టు కనబడలేదనుకో.

అలాంటి ఏర్పాట్లు జరిగితే ప్రొడ్యూసరు బావమరదిగారి వీపు చిట్లిపోయేదిగదా. సదరు పనే జరిగితే, చిట్లిపోయిన వీపు బొమ్మలూ

కథాకమామీషూ తెల్లారేసరికల్లా అక్కడి సినిమాపత్రికలోకెక్కి పోయేవి కదా.

చెప్పొచ్చిందేమిటంటే, వాళ్ళమాట తీరుతెన్నులూ, ఆ ఫేసులమీద ఎక్స్‌ప్రెషన్‌లూ చూచి నేను చాలా కదిలిపోయాను. అంటే మూవ్ అయిపోయానన్నమాట.

ఏమిటీ స్వామిభక్తి? ఈ కళానురక్తి? ఈ ఐకమత్యం? వీళ్ళంతా ఒక్కరేనా? వేర్వారా? అని ఎంతో పరిశోధన చేశాను.

అడపా తడపా మా ప్రొడ్యూసరుతో అనేసేవాణ్ణికూడా— "నేనిలా కదిలిపోతున్నానూ, వీళ్లాక్కొక్కళ్ళూ మహానటులూ, మీ పిక్చరులో ఛాన్సులివ్వరాదా?" అని.

ఇలా అనగా ఓరోజున రుమాల్‌సింగు విన్నాడు. అనక నన్ను ఒక్కణ్ణీచేసి ఓచోట కూచోపెట్టేసి, దిలీప్‌కుమార్‌నీ, ప్రేమనాథ్‌నీ, రాజకపూర్‌నీ మించిపోయేలా నటించి చూపించి వదిలాడు. యజమానికి రికమెండు చేయమని కోరుతూ ఓ పాతిక నాచేతులో పెట్టాడు.

మర్నాడు తెల్లారేసరికి, నాదగ్గిర రెండువందలయాభై చేరాయనుకో.

ఇప్పుడు నువ్వు ఊహించగలవా వాళ్ళెవరో, ఎంతటి ఘనులో? ఎలాటి మునులో మనలో?

"బహుశా శాపంవల్ల ఛాన్సు దొరకని మహానటులు అయివుంటారు. ఆకలిబాధకు తాళలేక చివరికి కళామతల్లికి నమస్కరించి ఇలా డ్రైవర్లుగా వంటవాళ్లుగా, గుమాస్తాలుగా కుదురుకుని ఉంటారు." అన్నాడు వరహాల రాజు బరువెక్కిన హృదయంతో.

"లాభంలేదు. నీది బ్రహ్మాండమైన బుర్ర కాదనుకుంటా, విను.

వాళ్ళారుగురిదీ ఒకే ఊరుట. అందులో ముగ్గురు చుట్టాలట.

కాస్త పొలం పుట్రా, ఇల్లు వాకిలీ ఉన్నాయి గాని, సినిమాలో చేరాలని ఈవూరు వచ్చారు.

వాళ్ళకి తోచిన ఉత్తమపద్ధతి ఇది. అడగాల్సిన వాళ్ళందర్నీ ముఖాముఖిని అడిగేసి లేదనిపించుకుని ఆఖరుకు ఈసదగ్గిర ఇలాచేరి దారుణంగా నటించి తమ ప్రతిభను చూపించేస్తున్నారన్నమాట. అన్నం తింటున్నా, కారులో వెళ్తున్నా, ఇంట్లో కూర్చున్నా ఆ నిర్మాత ఈ గొప్ప నటుల ప్రతిభను గుర్తించడం తప్పనిసరి — అని వాళ్లు నమ్మారు. ఏదో ఒక రోజున గభీమని బుక్ చేసి ఊరుకుంటాడని ఆశపడ్డారు.

వాళ్ళ కథలు విన్నాక నాహృదయం మళ్ళీ కరిగిపోయింది. అలాగే చెబుతాను అన్నాను. కాని ఈలోగా, నాకే ముప్పు ముంచుకొచ్చింది.

నేను టోకరా ఇచ్చిన ఆసామి మెల్లిగా నా ఆచూకి కనిపెట్టి, మా ప్రొడ్యూసరికి ఆకాశరామన్న ఉత్తరం రాసేశాడు. ఇలా నీకొంపలో చేరి నీతో తిరిగేవాడు హాలీవుడ్ వెళ్ళలేదూ. నీకు షోకైన టోకరా ఇచ్చాడు సుమీ అని.

ఇది ఆయన కంటపడేలోగానే, సెక్రటరీ నాకు చూపించాడు; నేను మళ్లీ నిజం చెప్పినా ఆయన ఇంక నమ్మడన్న నమ్మకంకొద్దీ, చేతిలో రెండొాందలు చేరాయన్న ధీమాకొద్దీ నేను ఆ యింట్లోంచి "ఫేడౌట్" అయిపోయాను.

అది వేరే కథ అనుకో. అని కథ ముగించాడు నరసన్న.

"చెప్పొచ్చింది ఆ యింట్లో జమాల్, రుమాల్, పెరుమాళ్ అండ్‌కోల తెలివితేటలు, నేర్పు గమనించావా? వాళ్లు ఏనాటికేనా, చిన్న వేషమేనా సాధిస్తే అది ఈ నేర్పువల్ల వచ్చిన ఫలితమే అవుతుంది. నీకు అంతటి దారుణ తెలివితేటలు ఉన్నాయా వరహాలరాజా? ఇంత బ్రహ్మాండమైన ఊహ నీకు తట్టుతుందా భావి హీరో?" అన్నాడు నరసన్న ఎడిషనల్ డైలాగురైటరు ప్రజ్ఞను ఉపయోగించి.

"లేదు; తట్టదు." అన్నాడు రాజు వినయభయ సంభ్రమాశ్చర్య చకితుడై.

"అయితే లాభంలేదు. రైలుదిగి ఇంటి కెళ్ళిపో తక్షణం" అన్నాడు నరసన్న.

"రైలు పరుగెడుతోందే ఎలాగ?" అన్నాడు రాజు కిటికీలోంచి తొంగిచూసి.

* * * *

"దిగలేవా?.... ఒక కథ చెబుతాను విను" అన్నాడు నరసన్న నవ్వుతూ.

....ఇలాగే ఓసారి తంజావూరునుంచి చలనచిత్ర రాజధానికి ఒక రైలు పరిగెడుతోంది. అందులో ఒక ప్రముఖ దర్శకుడు ఉన్నాడు. ఒక "మామూలు ముఖ" నటుడు కూడా ఉన్నాడు, చెప్పలేము గదా ఏముఖం వెనక ఎంతటి మహానటుడున్నాడో".

"మరేంది ఉప్పుకప్పురంబు నొక్క పోలికనుండు అన్నాడు వెనకటి కొక మహాకవి" అన్నాడు రాజు తకీమని.

"భేష్ నువ్వు మామూలు డైలాగులేకాదు ఎడిషనల్ డైలాగులు కూడా రాయడానికి పనికొస్తావు. నే చెప్పలే? నీకా శక్తి ఉన్నట్టుందని?"

"థాంక్యూసార్. చిన్నప్పట్నించీ డైలాగులంటే నాకు చాలా యిష్టం. అవే నాజీవిత లక్ష్యమండి. అవిలేందే బతకలేనండి....ఒకోసారి అర్ధరాత్రి గబుక్కున డైలాగులు రాసేస్తానండి. ఏమిటో....మావూళ్లో నాగయ్యగారు ఊహూ మెచ్చుకునేవారు. మీరు డైలాగులు రాయాలండీ. అసలందుకే పుట్టారండీ అని" అన్నాడు రాజు వినమ్రత ఉట్టి పడేలా.

"ఎవరూ? నేనా" అన్నాడు నరసన్న తుళ్ళిపడి.

"కాదు. నేనండి"

"నాన్సెన్స్. నేనెందుకు పుట్టినట్టు, మరి?"

"మీరు అడిషనలు డైలాగు రాస్తానన్నారుగా?"

"గ్రాండ్! నీది బలే చురుకైనబుద్ధి సుమా. అసలు యివాళ సినేరియాలు రాసే వాళ్లెంతమందికి ఇంత దారుణమైన చురుకుతనం ఉందీ అంటా?"

"ఒక్కడిగ్గూడా లేదుటండీ మా ఊళ్లో నాగయ్యగారు చెప్పారు అందరూ ఉత్తిమప్పులుటండి. నువొక్కడివే జీనియసువోయ్ అన్నారండి."

"ఎవరు నేనా'' అన్నాడు నరసన్న మళ్ళీ తుళ్ళిపడి.

''కాదు నేనండి'' అన్నాడు రాజు వినయవేషం వేసుకుని.

''మరి నేనెవణ్ణిట?''

''మీరు అడిషనల్ డైలాగు రైటరన్నారు కదండీ. ఇంకోటి, నాగయ్యగారు మీకు తెలీదుగా, అందుకని ఆయన చెప్పేవి నన్ను గురించేండి."

''ఐనా సరే, నేనుకూడా జీనియస్‌నే.''

''పోన్లెండి మనిద్దరం జీనియసులమే.''

''రైరో, అలాసర్దుకుపోవాలి. గుత్త తీసుకుంటే ఎలా? మనిద్దరం జీనియసులమే. చూట్టానికి వేరే వేరేగా ఉన్నా అసలు జీనియసులమే. ఇందాక డైలాగు చెప్పావు ఏమిటదీ, ఉప్పుగురించి.దాన్ని తిరగేస్తే మనం."

"మరేండీ.''

''అన్నట్లు ఆ ఉప్పుడైలాగు మనకన్నా ముందరే ఎవడో రాశాడన్నావు ఎవడు వాడు ?''

''వాడాండి .... వాడిపేరు పోతన్న అండి''

''ఐ సీ. ఇదివరకు ఎన్నిపిక్చర్లకి రాశాడు ? .... .... ఇదెందులో పెట్టాడు ? బావుంది. లిరికల్ బ్యూటీ వుంది. అందుకే అడిగాను. రేపు నేను తెలుగుపిక్చరుకి రాస్తే వాడుదామని.'' అన్నాడు నరసన్న గంభీరంగా.

''ఆయన ఏపిక్చరుకీ రాసినట్టే లేదండి. కాని, ఓ పిక్చర్‌లో వేశాడు. దానిపేరుకూడా పోతన్నే అనుకుంటా."

''ఐసీ'' అన్నాడు నరసన్న.

ఈ సంగతి ఆయనకి నచ్చలేదని రాజుకి అనుమానం వేసింది.

''వేమన్న అనుకుంటానండి" అన్నాడు గబుక్కున ఉత్సాహంగా.

''వేమన్న కానీ ఇంకేమన్నా కానీ. ఐవిల్ యూజ్ ది డైలాగ్, నేను దీనిని వాడుతాను. ఇది బాగుంది. నువ్వేమన్నా సరే.''

''నేనేం అంటానండి. నేను హీరోఛాన్సు దొరక్కపోతే, డైలాగులు రాద్దామనుకున్నాను. ఈలోగా వాడనులెండి.''

''అన్నట్లు ఛాన్సులగురించి కదూ మాట్లాడుకున్నాం ? వడివేలు కథ చెప్పబోయాను .... ....